# రంగదాసు ప్రేమ కథ

రంగదాసుకు ప్రేమపిచ్చి ఎక్కువ.

పాపం - ఇప్పటికి కనీసం ఒక పాతికమంది అమ్మాయిల్ని ప్రేమించి ఉంటాడు. అయితే ఏ ఒక్కరూ ఇతని వైపు కన్నెత్తి చూడక పోవడంతో వచ్చింది చిక్కు.

పట్టుదలకు మారు పేరు రంగదాసు. కొత్త 'ప్రేయసి' కోసం వెదికేందుకు ఓ కొత్తరకం చొక్కా కొందామని షాపు కెళ్ళాడు. షాపంతా రకరకాల రంగు రంగుల రమ్యమైన రెడీమేడ్ షర్టులతో కళకళలాడుతూంది. తన ప్రత్యేకత నిల బెట్టుకోవడం కోసం ఓ చిత్రమైన కొత్త రకం డిజైన్‌గల ఓ చొక్కా తీయించి పాక్ చేయించాడు. బిల్లుతోపాటు ఓ గులాబిరంగు కాగితం ఇచ్చాడు షాపు యజమాని. ఇస్తూనే చెప్పాడు. 'నాలుగు రోజులనాడు మా షాపుకొచ్చిన ఓ యువతి ఈ ఉత్తరం మా కిచ్చారండి, ఈ షర్టు ఎవరు కొంటే వారికిమ్మని '

రంగదాసు గుండె స్థానం తప్పి మళ్ళీ స్వస్థానం చేరింది.

'ఎలా ఉంటుంది? వయసెంత?' అన్నాడు ఖంగార్సంతోషంగా.

'చాలా బాగుంది. ఇరవైకి ఒకటటూ యిటూ.''

ఈ మాట వినడంతోనే రంగదాసు క్షణాలమీద బిల్లుచెల్లించి అరక్షణాలమీద రూం చేరుకొని గులాబిరంగు ఉత్తరం విప్పాడు.

శ్రీ.... గారికి,

దయచేసి మీ ఫోటో యీ క్రింది అడ్రసుకు పంప ప్రార్థన.

విధేయురాలు,

సునీత

క్రిందు మీదయ్యాడు రంగదాసు. ఇన్నాళ్ళకు ఓ వనిత తనంతట తను 'తన'ను వలచినందుకు ఉప్పొంగి పోయాడు. వెంఠనే ఓ ఫోటో ఓగేసి ఆ చిరునామాకు పంపేశాడు.

ఆ రోజునుంచీ పోస్టుమాన్ కోసం నిరీక్షణ రంగదాసు కార్యక్రమంలో ప్రధాన పాత్ర వహించింది.

ఫోటో పంపిన సరిగ్గా నాలుగో రోజు.

రంగదాసుకు గులాబిరంగు కవరం దింది.

రంగదాసు స్నానంచేసి, ఒళ్ళంతా పౌడర్ రాసుకొని, అందంగా అలంక రించుకొని, విలాసంగా సిగిరెట్ ముట్టించు కొని మరీ ఉత్తరం చించాడు.

గులాబిరంగు కవర్లో, గులాబిరంగు కాగితం. ముత్యాల్లాంటి అక్షరాలు. శ్రీ రంగదాసుగారికి, నమస్తే. మీ ఫోటో అందింది. కృతజ్ఞతలు. ఇంత పరమ చెత్త ఫాషనుతో వచ్చిన ఆ చొక్కా కొనే ఖుంర ఎలా ఉంటాడో చూద్దామన్న నా కోరిక తీర్చారు. మరోసారి థ్యాంక్స్.

ఇట్లు,

సునీత

పి. యస్: ఈ విషయమై ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు, మా ఇంట్లో నేను పెంచుకొనే బొచ్చుకుక్క కాక మరో మూడు ఆల్సేషియన్లున్నాయనీ, నా అన్నలు ముగ్గురూ పోలీసు డిపార్టుమెంటులో పెద్ద పదవులలోఉన్నారనీ గమనించ ప్రార్థన. ★

— వేమూరి సత్యనారాయణ.